# క్రోటన్స్

గబగబా పేజీలు తిప్పుతున్నవాడల్లా హఠాత్తుగా ఆగిపోయాడు మోహన్. పింక్ కలర్‌లో శ్రద్ధగా రాసిన అక్షరాలు....సౌమ్య....ఒక జ్ఞాపకాల అల కుదిపి నట్లయింది. ఒక జలపాతం....ముంచెత్తే వరద గోదావరి-అవన్నీ కలిపితే సౌమ్య.

"....12 గంటలు కావటానికి రెండు నిముషాల ముందుగా నీకు ఉత్తరం రాయటం మొదలు పెట్టాను. మోహన్....ఈ ఉత్తరం పూర్తయ్యేసరికి కొత్త సంవత్సరం వచ్చేస్తుంది. సరిగ్గా ఈ నిముషాల్లో నిన్ను తలచుకోవటం, నా కనుపాపల్లో నిన్ను నిలుపుకోవటం ఓ కొత్త అనుభవం. నిజంగా ఈ వెన్నెల, ఈ అద్భుతమైన రాత్రి భువన మోహనంగా ఉంది ఒక్క నువ్వులేని లోటు తప్ప....

చేతులు వణుకుతుంటే ఉత్తరం కింద పెట్టేశాడు మోహన్. గుండె కొట్టుకుంది. ఇంకా నయం కాన్ఫిడెన్షియల్ ఫైల్లోవున్న ఈ ఉత్తరం ఎవరూ చూడలేదు. కాసేపు ఆలోచించాడు. దాచటం కష్టం. ఇప్పుడు సౌమ్య ఒక జ్ఞాపకం మాత్రమే. అంతే. తన కేమీ కాదు. ఓ బాధావీచిక మొహం మీద కదిలింది. ఉత్తరం భద్రంగా దాచుకోవాలని అనిపించింది. కాసేపు ఆలోచించి డస్ట్‌బిన్‌లో పడేశాడు. మనసు పాడయింది. అమ్మ పోయాక ఆవిడ బీరువాలో నగల పెట్టెలో గంధం వాసనల మధ్య ఆవిడ దాచుకున్న ఉత్తరాలు, నాన్న ఇచ్చిన చిన్న చిన్న కానుకలు చూసి తను బాధపడటం గుర్తుకొచ్చింది. ఉత్తరం చించేసుకొని తను తప్పు చేశానా అనిపించింది. అద్దాల్లోంచి ఫైల్స్ చూస్తున్న స్వాతి కనిపించింది. సాయంత్రం కాసేపు స్వాతితో మాట్లాడుదామా అనిపించింది. డైరీ తీసి చూశాడు.

సిక్స్‌థర్టీకి ఏదో బేకరి షాపు ఓపినింగ్, సెవెన్‌కు హోటల్ తేజాలో ఎగ్జిక్యూటివ్స్ మీటింగ్. రెండూ ఆబ్లిగేషన్స్, ఇవ్వాల్టికి కుదరదు స్వాతిని చూడడం అనిపించింది.

"మరి నీకే రోజైనా కుదురుతుందా" అని లోపలి గొంతేదో నొక్కి అడుగుతోంది.

స్వాతి ఇదే అడిగింది.

సంవత్సరంగా వ్యవహారం నడుస్తోంది. జనవరి ఫస్ట్‌న ఆఫీస్ ఫంక్షన్ అయ్యాక ఆవిడను ఇంటిదాకా దిగబెట్టాల్సిన బాధ్యత తనమీద పడింది. ఆవిడ ఇంటి దగ్గర నుంచి రెండు బస్సులు మారి ఆఫీసుకు వస్తుందట. దారిలో కారు చెడింది.

నిర్మానుష్యంగా ఉన్న వీధుల వెంట నడుస్తూ చెప్పుకున్న కబుర్లలో, హఠాత్తుగా ఆమె తండ్రి పోతే కుటుంబం గడవటం కోసం రీసెర్చి వర్కు ఆపేసి ఉద్యోగంలో చేరటం, తనమీద ఆధారపడిన తల్లి, తమ్ముడు తన మెకానికల్ జీవితం గురించి ఆమె చెపితే, తనకు తల్లి లేకపోవటం, ఇంట్లో తండ్రి, తను చెరో మూల వంటరిగా బతకటం గురించి తను చెప్పుకోవటం....అరాత్రి తమ ఇద్దరి మీద విసిరిన మాయాజాలం....ఆమె చేయి ఎప్పుడు అందుకున్నాడో తెలియదు. స్వల్పంగా వణికిన ఆమె శరీర స్పర్శ తన చేతికి తెలుస్తోంది. వద్దనలేదు....ఆలోచిస్తానంది. అదే తనకు నచ్చింది.

ఫోన్‌చేసి ఆపరేటర్‌తో పి.ఎ ను లోపలికి రమ్మనమని చెప్పాడు.

ఆ అమ్మాయిని చూడాలని గట్టిగా అనిపించింది. ఫోన్ పెట్టేస్తుండగానే సుబ్రహ్మణ్యం అయ్యర్ రావటం అద్దాలలోంచి కనిపించింది. ఆపుకున్నా ఆగని విట్టూర్పు వచ్చింది మోహన్‌కి.

ఇక ఈయన ఇప్పట్లో వదలడు. ఇతని ఏరియా రిపోర్టు అంత సరిగ్గాలేదు. డబ్బు రికవర్ అయ్యేదాకా సరుకు పంపవద్దని చెప్పాడు. ఇదుగో ఇలా తిరుగుటపాలో ఈయన వచ్చేశాడు.

చిరాకుతో ముడిపడిన మొహంమీదకి బలవంతంగా చిరునవ్వు తెచ్చుకొని "హలో! అయ్యర్‌గారూ వెల్‌కమ్" అన్నాడు నవ్వేస్తూ.

వెనకే బుక్ తీసుకొని స్వాతి కూడా వచ్చింది. "మిస్ స్వాతీ! అయ్యర్‌గారి ఎకవుంట్స్ ఒకసారి చెక్ చేయి నేను మళ్ళీ పిలుస్తాను" అన్నాడు మోహన్.

స్వాతి తలవూపి వెనక్కి తిరిగి వచ్చి తన సీట్లో కూర్చుంది. ఎదురుగా అద్దంలోంచి మోహన్ అయ్యర్‌గారితో మాట్లాడటం కనిపిస్తోంది.

నిన్న ఉదయం అయ్యర్ ఫైల్ టేబుల్‌మీద విసిరి కొట్టి "వాడికి చచ్చినా మెటీరియల్ పంపద్దు" అని కసిరాడు. ఇవాళ చూడు 'అబ్బ ఇతనికి ఇరవై నాలుక లున్నాయి' అనుకుంది. మాటలు వినపడటం లేదు కానీ మోహన్ నవ్వటం, దర్జాగా రిలాక్స్‌గా కుర్చీలో జారగిలబడి కూర్చోవటం కనిపిస్తోంది. అయ్యర్ మరీ వినయం చూపిస్తున్నాడు. చూపించక చస్తాడా? ఇప్పుడు సరుకు ఆగిపోతే మునిగిపోతాడు. మోహన్‌కి ఎంత పొగరు. ఎదుటిమనిషిని మరుగుజ్జును చేసేశక్తి తన చేతిలో అధికారానికి, డబ్బుకి ఉందని తెలిసిన మనిషి. ఎంత అందంగా ఉన్నాడు. వత్తయిన జుట్టు మొహం మీదకి జారుతోంది. ఎక్కడా చెగుళ్ళు, విచారాల జాడలు తెలియని వెలుగుతున్న మొఖం. స్వాతికి అతని మీద ప్రేమ కలిగింది. విచారమూ కలిగింది. ఇతన్ని నేను భరించగలనా ?

అదే సంవత్సర కాలంగా భయపెడుతూ, బాధపెడుతూన్న అంశం.

అవసరానికి మించి ఒక్కమాట మాట్లాడటం వినలేదు. ఎవ్వరికీ చనువు ఇవ్వటం, సరదాగా వుండటం లేదు. నిమిషాలతోసహా లెక్కవేసినట్లు సరిగ్గా పది గంటలకు ఆ సీట్లో కూర్చుంటే లంచ్ టైం మినహాగా అక్కడ నుంచి కదిలే ప్రసక్తిలేదు. కంప్యూటరు బ్రెయిన్‌తో ఆఫీసలో ఎక్కడ ఏం జరుగుతుందో కని పెట్టటం, ఎవరైనా టాలెంట్ చూపించగలిగితే లెక్కలుకట్టి ఇంక్రిమెంట్ నిమిషాల మీద ఇప్పించగలగటం....అతనో మెషీన్, పక్కా బిజినెస్ మ్యాన్. సంవత్సరంగా నడుస్తున్న ప్రేమ వ్యవహారంలో మొత్తం మీద పది పదిహేనుసార్లు పదేసి నిము షాలు మాట్లాడి ఉంటాడు తనతో పర్సనల్‌గా. హఠాత్తుగా వర్షం వచ్చి పని అప్ సెట్ అయినా, అతని ఎంగేజ్‌మెంట్స్ ఏదైనా హఠాత్తుగా కాన్సిల్ అయిన వేళకు తను ఆఫీసలో ఏదో పని చేసుకుంటూంటే, అదీ అతనితో పని ఉండి ఛాంబరులోకి వెళితే అప్పుడు పలకరింపు.

"స్వాతీ" అన్న పిలుపులో ఎంత మార్దవం. శాసించే ఆ గొంతుతో అంత సున్నితమైన భావం ఎలా పలికించాడో టేబుల్ మీద చేయి చాచి డిక్టేషన్ తీసుకుం టుంటే తన చేతుల మీద చేయి వేసి అలా వదలకుండా ఎంత గాఢంగా నొక్కి పట్టాడో అదే స్పర్శ....అంతే....ప్రేమ అంటే అదేనా? తన ఫ్రెండ్స్ అంతా చెప్పు కునే ఆవేశం తొందరపాటు లేదు. ఏదీలేదు. ప్రేమ పెద్ద గొప్పగా ఏం లేదు. స్వాతి నిట్టూర్చింది. ఫైల్ చూడటం మొదలు పెట్టింది. పదినిముషాల్లో ఎకౌంట్స్ బుర్ర నిండా నిండిపోయాయి. అయ్యర్‌గార్ని పంపేసి రిలాక్స్‌డ్‌గా కాళ్ళు చాచి కూర్చున్నాడు మోహన్. ఎందుకో తల తిప్పితే స్వాతి కనిపించింది. కుర్చీలో కూరుకుపోయి దీక్షగా కళ్ళజోడులోంచి చూస్తూ కాలిక్యులేటర్‌తో లెక్కలు కడు తోంది. అలాగే చూస్తూ కూర్చున్నాడు.

ఏవిటీ పిల్ల....జుట్టంతా రేగిపోయి....పాపం రెండు బస్సులు మారి రావాలి... కాటన్ డ్రస్‌లు అవీ శుభ్రంగా ఇస్త్రీపెట్టి వేసుకొస్తుంటుంది. బాగానే ఉంటుందనుకో. అంత జీతం పుచ్చుకుంటుంది కదా పిసినారి తనం ఏమిటో. మొత్తం డబ్బంతా చిట్‌లు, షేర్‌లకే సరిపెడుతుంది. నోరు తెరిస్తే షేర్ల గురించి తప్పితే మరో ముక్క రాదు.....ఎంత డబ్బు ఉందో? ఆపుకున్నా ఆగని, నవ్వు వచ్చింది మోహన్‌కు. క్రిందటి సంవత్సరం అప్పులుచేసి, వడ్డీలకు తెచ్చి చిట్స్ ముందే పాడి దగ్గర దగ్గర లక్షకు పైగా షేర్స్‌లో పెట్టిందట. అవి కాస్తా కొలాప్స్ అయ్యా యిట. ఇక చూడు కదిలిస్తే ఏడ్చేలా తయారైంది. పోన్లే ఎలాగైతేనేం తెలివిగా వాటిని అమ్మకుండా కష్టపడి అసలు తీర్చింది. ఈమధ్యలో వాటి మీద చాలా డబ్బు వచ్చిందట. తెలివైందే.

పెళ్ళి కూతుళ్ళ పేరుతో తనకు పరిచయమయిన చాలామంది అమ్మాయిలకు మెదడు మోకాలిలోనే ఉందని తేలింది. సౌమ్య బాగానే ఉంటుంది కానీ ఆవిడ కవిత్వం భరించడం చాలాకష్టం. పరిచయమయిన పదోగంట నుంచి తనకు ఫోన్ చెయ్యలేదని సాయింత్రం షికారుకు రాలేదని, తను రాసే స్లిప్పుకు సమాధానాలు రాయలేదని అలిగి ప్రాణం తీసింది. నెల రోజుల తరువాత తనకే నచ్చలేదని చెప్పిం దట. ప్రాణం తెరిపిన పడింది. వ్యాపారం అంటే సవాలక్ష టెన్షన్స్. ఇవన్నీ ఎక్కడ కుదురుతాయి. రెండు నెలలు నాగపూర్‌లో కాన్ఫరెన్స్‌కు వెడితే స్వాతి ఒక్కతే ఆఫీస్ మెయిన్‌టెయిన్ చేసింది. అప్పుడే జాగ్రత్తగా షేర్స్ అన్నీ అమ్మేసుకొని తన డబ్బు రికవరీ చేసుకుందట. ఇంటలిజెంట్ గాళ్. అక్కడిదాకా ఎందుకు క్రిందటి నెలలో ఆఫీస్ ఫంక్షన్ ఎరేంజ్ చేస్తే నూట యాభై మందికీ మంచి డిన్నర్. ఏ.సి. కాన్ఫరెన్స్ హాల్‌తో సహా ఆరువేలు బిల్లు అవలేదు. ఆ హోటల్ ప్రొప్రయిటర్ విజయ్‌కు ఏదో సాయం చేసిందట స్వాతి. హటాత్తుగా హోటల్‌మీద రైడింగ్‌కు వచ్చారని తెలిసి వెంటనే ఎకౌంట్సు విషయంలో మంచి సి.ఎ ని ఎరేంజ్ చేసిందట. ఆ సాయానికి ఈ హోటల్ వాడు మురిసి మూర్ఛపోయి మినిమమ్ ఛార్జ్ వసూలు చేసి అద్భుతమైన భోజనం పెట్టాడు. అక్కడ సెంటర్ ఆఫ్ ఎట్రాక్షన్ స్వాతి.... పార్టనర్ అలా వుండాలి. మోహన్ పెదవుల మీదకు చిరునవ్వు వచ్చింది. ఆప రేటర్‌తో స్వాతిని లోపలకు పంపమని చెప్పాడు. తలుపులు తెరుచుకుని లోపలికి వచ్చింది స్వాతి ముక్కుమీదకు జారిన కళ్ళజోడుతో తెల్లని మొహం, గాలికి ఎగిరే పొట్టి జుట్టు, గంజిపెట్టి ఇస్త్రీ చేసిన మడత నలగని డ్రస్‌లో స్వాతి .... కమిన్ స్వాతి....ప్లీజ్ టేక్ యువర్ సీట్....థాంక్యూ....మడతలు నలగకుండా సర్దుకుని కూర్చుంది స్వాతి. మళ్ళీ రేపు ఇదే వేసుకుంటుంది కాబోలు....

"స్వాతీ! నాన్నగారితో మాట్లాడేను. వచ్చేనెలలో డేట్సు ఫిక్స్ చేసుకుంటే కుదురుతుందా?" స్వాతి తలెత్తకుండా కూర్చుంది. కాసేపు ఆగాక మోహన్ మొహం లోకి చూసింది.

"డిసెంబర్ ఎండింగ్ కయితే మీరు స్విట్జర్లాండ్ వెళ్ళే అవకాశాలున్నాయి. ఛాంబర్ ఆఫ్ కామర్సునుంచి ఈ సంవత్సరం మిమ్మల్ని అక్కడ మీటింగ్స్‌కు ఎటెండ్ అయ్యేందుకు సెలక్టు చేశారట. టూ అండ్ ఫ్రో చార్జస్, అక్కడ ఎకామ డేషన్ వాళ్ళే చూస్తారు....అప్పుడైతే నేనూ మీతో రావచ్చు....మళ్ళీ వేరే.... మోహన్‌కు అర్థం అయింది.

పెళ్ళవగానే హనీమూన్‌కు వెళ్ళే ఖర్చులో సగం తగ్గుతుంది. ఒక్క నెల ఆగితే ఇటు పెళ్ళి అటు హనీమూన్....

చేయి చాపి స్వాతి చేయి అందుకున్నాడు ఎందుకో చల్లగా అనిపించింది. హఠాత్తుగా సౌమ్య గుర్తుకు వచ్చింది. ఒక పార్టీలో పరిచయం అయింది. తెల్లగా మంచులో తడిసిన గులాబి పువ్వులా ఉంది. తెలివైన కళ్ళతో ఒక్క అరగంటలో తను పొడుగ్గా ఉన్నాడని మంచి రంగని, మంచి ఇంగ్లీషు యాక్సెంట్ అని ఎన్నింటికో మెచ్చేసుకుంది. వారం రోజుల తరువాత ఉదయాన్నే ఫోన్‌చేసింది 'మార్నింగ్ వాక్‌కు రమ్మని కలిసి నడుద్దామని' ఏడు గంటలకు. తనకు బిజీ ఎంగేజ్‌మెంట్స్. నిమిషం తీరికలేదు. ఆ రోజు ఆ మాటే చెప్పాడు. ఈ ఒక్కరోజు త్యాగం చేయవచ్చు కదా అంది.

'నిజంగా కుదరదు'

ఇంకోరోజు సరిగ్గా పదిన్నరకు ఫోన్ చేసింది మంచి నిద్దట్లో వున్నాడు తను. ఎన్ని పనులున్నా పది గంటలకు నిద్రపోవాలి. అంతే అది కండిషన్. ఆ రాత్రి వెన్నెల ఎలా ఉందో, తన గురించిన ఊహలు ఆమెను ఎంత ఉక్కిరి బిక్కిరి చేస్తున్నాయో అందంగా రాసింది ఫోనులో చదివేస్తోంది. 'సారీ' చెప్పాడు ఇప్పుడు తనకు వినే మూడ్‌లేదని. ఆ రోజు మూడు గంటలకు ప్లేన్ టిక్కెట్ బుక్ చేయించాడు. ఫోన్ అలారంపెట్టించి నిద్రపోతుంటే ఈ కవిత్వం వినటం కుదిరే పనికాదు. ఆ తరువాత సౌమ్య ఇక పలకటం మానేసింది.

స్వాతి చేయి తన చేతిలోకి తీసుకుంటే ఎందుకు వెచ్చగా తగలలేదో అర్థం కాలేదు.

అబ్బ ఈ టెన్షన్, ఆఫీసులు వదిలేయి ఈ సాయంత్రం మనకోసం. సముద్రం వైపేచూడు మోహన్....నాకైతే సముద్రం ఎప్పుడూ ఒక అద్భుతం. గలగలమంటూ అల పరుగెత్తుకు వచ్చి నన్ను....రా రమ్మంటున్నట్లు ఉంటుంది. సముద్రం అంటే జీవచైతన్యం, నాకెప్పుడు బతుకు అలా చైతన్యవంతంగా వుండాలి. వెధవ లెక్కలు పరుగులు, టెన్షన్లు వద్దు బాబూ. ఇకచాలు ఈ పరుగు. హాయిగా బతుకుదాం అన్నది ఆవేళ సముద్రం దగ్గర కూర్చున్నప్పుడు సౌమ్య.

సముద్రం దగ్గర కూర్చున్న ఆ అరగంటలో ఎన్నిసార్లు కలకత్తా ఫోన్ వస్తుందోనని గుర్తువచ్చిందో. ఎన్నిసార్లు రేపు ఎల్ ఐ.సి చెక్ పంపాలని గుర్తువచ్చిందో చెప్పలేం.

ఉదయాన్నే ఆఫీస్‌కు రాగానే స్వాతి....తను కలకత్తా ఫోన్ రిసీవ్ చేసుకున్నట్టూ, పన్నెండుదాకా ఆఫీసులోనే ఉండిపోయినట్టూ చెప్పింది. ఎంత రిలాక్స్ అయినట్లుందో....డటీజ్ స్వాతి !

ఈసారి అంత చల్లగా లేదు స్వాతి చెయ్యి. షేర్లు గుర్తుకొచ్చాయి మోహన్‌కి. స్విట్జర్లాండ్ కాన్ఫరెన్సు గుర్తుకొచ్చింది స్వాతికి. (సుప్రభాతం)